వరద

వజ్ఝల కాళిదాసు

పరమ శ్రోత్రియుడైన వెంకటశాస్త్రికీ అంటరాని కులంలో పుట్టిన బారిక వెంకడికీ ఎలా స్నేహం కలిసిందో, పాలతేరు గ్రామంలోని వాళ్ళెవరికీ అర్థం కాలేదు కాని శాస్త్రి శ్రీమతి లక్ష్మీదేవమ్మకి తెలుసు వెంకడికీ శాస్త్రికీ ఉన్నది స్నేహం కాదనీ కేవలం శైష్యోపాధ్యాయిక అనీ. అదేవిటీ అని తరిచిచూస్తే తేలే విషయం మరేమంత విడ్డూరమూ కాదు, ఆశ్చర్యకరమైనదీ కాదు. ఏ పూర్వజన్మ వాసనవల్లనో వెంకడికి చిన్నప్పటినుంచీ చదువన్నా చదువుకున్నవాళ్ళన్నాసరే గౌరవమూ, భక్తీ కూడా. వాటికితోడు ఆసక్తీ శ్రద్ధా వాడిలో మూర్తీభవిం చేయి శ్రోత్రియుడైన శాస్త్రికి ఛాందసం లేదు కాబట్టే వెంకడిని కూడా తన శిష్యకోటిలో చేర్చుకున్నారు

అయితే కావ్యాలు, వ్యాకరణం, వేదాలు పగటి వేళ బ్రాహ్మణ శిష్యులకి చెప్పేవారు, రాత్రిళ్ళు తక్కిన శిష్యులకి 'చదువు' చెప్పేవారు. వీరిలో కుమ్మరి బసవయ్య బారిక వెంకన్నశాస్త్రిగారి అభిమానం చూరగొన్నారు. బసవయ్య చిన్న చిన్న పద్యాలు అల్లడం కూడా మొదలుపెట్టేడు. వెంకన్న వేదాంతపు పాటలు గొలికేవాడు. వెంకన్న వేదాంత ధోరణికి చుట్టుపక్కల ఉన్న ఊళ్ళైన అలజంగి, ఆనవరం, పెంట, భీమవరం, ముగడల్లోని రైతులందరూ ఆశ్చర్యపడేవారు; ఆ పాటలు వింటూ ఉర్రూతలూగేవారు.

పాపం, వెంకన్నకి నలభైయేళ్ళేనా దాటక ముందే అతని భార్య మరణించింది — పురిటిలో. పదిహేనేళ్ళాయ కాపరం చేస్తున్నా సంతానంలేదని వెంకన్న దంపతులు వేయి మొక్కులు మొక్కుకున్నారు కొడుకు పుట్టేడన్న సంతోషం పట్టలేక కాబోలు వెంకన్న పెళ్ళాం శాశ్వతంగా కన్నుమూసింది భార్య గతించిన విచారంలో వెంకన్నకి వేదాంతం శాంతి కల్పించింది

శ్రీరామ భక్తి కల వెంకన్న, కొడుకు పేరు రాముడని పెట్టుకుని సంతోషించేడు

ఎందరు చెప్పినా మరో పెళ్లి చేసుకోలేదు వెంకన్న ముసలితల్లినీ పసిపిల్లడు రాముడినీ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాడు.

రాముడికి ఆరేళ్ళు నిండకముందే చదవడం అబ్బిందంటే వెంకన్న శ్రద్ధా, పట్టుదలా రాముడికి కూడా ఉన్నందువల్లనే.

రాముడికి చదువుతోపాటు పాటలు పాడటం కూడా అలవడింది

రాముడు సన్నగా చల్లగా పాడుతూ ఉంటే వెంకన్న పరవశించిపోయేవాడు. వెంకటశాస్త్రిగారు మెచ్చుకొనేవారు.

* * *

శ్రీరామ నవమి

పాలతేరులో ఉన్న మూడు రామ మందిరాల లోనూ — వాటిని రామ భజనలనే అనేవారు — భజనలు అతి భక్తితో పల్లె ప్రజలందరూ చేస్తున్నారు, చూస్తున్నారు. అందరితోటీ కలిసి భజనల్లో పాల్గొనలేకపోయినా దూరంగా, వారగా ఓరగా వెంకన్న ఆ రాత్రంతా కొడుకుని ఒడిలో పెట్టుకుని భజన చేసేడు తెలతెల్లవారుతున్నాదనగా తండ్రీ, కొడుకులు అలానే నిద్రలోకి జారుకున్నారు

భజనలు చూడవచ్చిన మాలపల్లి వాసులందరూ, ఉదయాన్నే స్నాన ధ్యానాలకి ప్రక్కనే పారుతున్న వేగవతీ నదికి వెళ్ళే అగ్రజాతివారి తిట్లకి దీవనలకీ భయపడి మాలపల్లికి దారితీసేరు. వెంకన్ననీ, రాముడినీ వాళ్ళు లేపలేదు ఏమంటే వెంకన్న మాలపల్లిలో ఉండటంలేదు, వెలమ దొరగారు గోపాలరాయణింగారి తోట కాపల కాబట్టే తోటలోనే ఓ చిన్నపాక వేసుకొని ఉంటున్నాడు, తనూ, తల్లీ, కొడుకూ.

అప్పుడే చీకట్లు విడుతున్నాయి

వెలుగు రేఖలు, ఎర్రగా తూరుపు దిక్కున లేచి తెల్లబడుతున్నాయి

వెంకటశాస్త్రి నిండైన విగ్రహం నదికి వెళుతూ ఉంటే, దారినిపోతున్న ఒకళ్ళిద్దరూ దండాలు పెడుతున్నారు శాస్త్రి చిరునవ్వుతూ, చేయెత్తి ఆశీర్వదిస్తూ కుశల ప్రశ్నలువేస్తూ నడక మానలేదు.

శాస్త్రి కళ్ళు ఆదమరిచి నిద్రపోతున్న రాముడునీ, వెంకన్ననీ చూచి నవ్వుకున్నాయి

ఆ కళ్ళల్లోని నవ్వులో ఒక విధమైన చిన్న చిలిపితనం తొంగిచూసింది.

శాస్త్రి చెయ్యి అప్రయత్నంగా రెండవ చేతిలో ఉన్న నీళ్ల చెంబులోకి వెళ్లి నీళ్ళుతీసి ఆ నిద్రిస్తున్న తండ్రీ కొడుకులమీద జల్లింది.

"లేండర్రా, తెల్లారినా ఆ మొద్దునిద్దరేవిటి లెండి . మీ యింటికి పొండి" అని శాస్త్రి నోరు గద్దించింది

అదే క్షణంలో ఓ పెద్ద గోల, అలజడి, "తప్పుకోండి. .తప్పుకోండి" అనే కేకలు వినిపించేయి

ఒక ఆవుని పెద్ద అంబోతొకటి తరుముకొని వస్తున్నది. దారి తెన్ను తెలియని ఆ గోలక్ష్మి విహ్వల నేత్రాల్లో నీళ్ళుతిరుగుతూ ఉంటే ఇటూ అటూ పరుగులుపెడుతూ ఉంది

అప్పుడే కళ్లు విప్పి చూచిన రాముడు భయంతో కంపించిపోయేడు; అంబోతు తనమీదికే వచ్చి పడిపోతున్నదనుకున్నాడు; సర్రుమని బాణంలా పరుగు దీసి వచ్చి శాస్త్రి కాళ్లని చుట్టేసేడు.

వెంకన్న ఉన్నచోటే మ్రాన్పడి "రాఁవుడూ" అని వెర్రివాడిలా కేకవేసేడు.

అనుకోని, అంతుతెలియని, క్షణికమైన ఆగ్రహావేశంలో "ఛీ, ఛండాలుడా! ఎంత దారుణంరా ఇది. ఫో" అంటూ వెంకటశాస్త్రి గర్జించడమూ, రాముణ్ణి చాచి లెంపకాయకొట్టి అవతలకినెట్టి వేయడమూ, చేతనున్న చెంబెడు నీళ్ళూ ఆ విస్తుపోయి చూస్తున్న పసివాడి నెత్తిని దిమ్మరించడమూ కనురెప్పపాటు కాలంలో జరిగిపోయేయి.

రాముడు బిక్కచచ్చిపోయేడు.

ఏ ప్రళయం తనమీద విరుచుకొని పడుతుందో అని వెంకడు స్థాణువులా చేతులు జోడించుకొని నిలబడ్డాడు.

నరసింహావతారంలాగ వెంకటశాస్త్రి కనబడితే, ప్రహ్లాదుడులాగ కనిపించేడు రాముడు.

మూడు క్షణాలు నిశ్శబ్దంగా నడిచేయి.

ఆ క్షణాలు యుగాల్లాగ గడిపేడు వెంకడు.

ఆవూ, అంబోతూ మరో వీధిలోకి పరుగు తీసేయి.

వెంకటశాస్త్రిగొంతు గంభీరంగా వినిపించింది— "వెంకా, అలాగ నిలబడిపోయేవేం ? ... పాపం రాముడు తడిసి ముద్దయిపోయేడు తుడిచి ఇంటికి తీసుకుపో ... ఊఁ ... త్వరగా వెళ్లు."

వెంకటశాస్త్రి హుందాగా, నెమ్మదిగా నది దిక్కుగా నడిచివెళుతూ వుంటే ఆ నాలుగు వీధుల కూడలిలో పోగైన ఆడా మగా అందరూ కళ్లప్పగించి చూస్తూ నిలబడిపోయేరు.

చైత్ర మాసపు సూర్యోదయ కిరణాలు చురుక్కుమని సోకుతున్నాయి.

ఒకొక్కరే ఎవరి దారి వాళ్ళు పోతున్నారు, వెనుదిరిగి వెంకడినీ రాఁవుడునీ చూస్తూ.

అప్పుడే ఏటిలో స్నానంచేసి నీళ్ళు బిందెలో నింపుకొని, తాను నడుస్తున్న దారివెంబడి నీళ్లు జల్లుకుంటూ వస్తున్న ఒక విశ్వస్తని చూడగానే, వెంకడు చప్పున రాముణ్ణి ఎత్తుకొని ఇంటి దారి పట్టేడు.

* * *

రోజూలాగే రాముడు ఆనాటి రాత్రి తండ్రి వెంట శాస్త్రి ఇంటి ఎదట కూర్చొని తండ్రి నేర్చుకొనేది వింటూ కూర్చున్నాడేకాని వాడి కళ్లల్లో ఉత్సాహానికి బదులు భయం చోటు చేసుకున్నది.

ఉదయం తిన్న చెంపపెట్టు జ్ఞాపకం వచ్చి రాముడు మరీ బెంబేలు పడిపోయేడు. చెంప తడుము కున్నాడు. తలకూడా తడుముకుంటూ వుంటే శాస్త్రి చూడటం తటస్థించింది.

"ఏరా రాముడూ, మీ అయ్య నీ తల సరిగ్గా తుడవలేదా ఏమిట్రా ప్రొద్దుట, బుర్ర తడుము కొంటున్నావు" అని శాస్త్రి ప్రశ్నించగానే రాఁవుడు చప్పున తండ్రి ఒళ్లో తలదాచుకున్నాడు.

వెంకడు కొడుకు తల నిమురుతూ "లే, బాబుగారికి దణ్ణంపెట్టు తప్పు క్షమించమని ... శాస్త్రుల్లుబాబూ, పసివాడు ... తల్లిలేని బిడ్డడు.. బెంబేలుపడి తఁవర్ని ముట్టేసుకున్నాడు ... కోపం పెట్టుకోమోకు బాబయ్యా ... "

వెంకడి మాటల్ని మధ్యలోనే ఆపింది శాస్త్రి కంఠస్వరం.

"మరేం బాధపడకు ... పాపం ఎంత భయ పడకపోతే రాముడు నా కాళ్లకి చుట్టుకునిపోతాడు. ఆ క్షణంలో మతిపోయినట్టు నేను వాణ్ణి ఛెళ్లని చెంపమీదకొట్టి వాడి నెత్తిని నీళ్లు దిమ్మరించేను పాపం ఎంత బాధపడ్డాడో ... తద్దోష పరిహారార్థం వేయిమార్లు గాయత్రీ జపం చేసుకున్నాను."

శాస్త్రి గొంతు జీరపోయింది. రాత్రి కాబట్టి ఆయన కళ్లల్లో మెదిలిన తడి ఎవరూ చూడలేదు.

వెంకడు చేతులెత్తి దండం పెట్టేడు; కొడుకు చేతలు రెండు పట్టుకొని దండం పెట్టించేడు.

ఇదంతా గమనిస్తున్న కుమ్మరి బసవయ్య కూడా అప్రయత్నంగా కైమోడ్పేడు.

ఇంతలో లక్ష్మీదేవమ్మ భర్త పక్కకి వచ్చి "ఇటు చూడండి, ఈ ప్రసాదపు పొట్లాలు బసవయ్యకీ, వెంకడికీ, రాముడికీ ఇయ్యండి . చాలా రాత్రయింది... ఓ పక్కనించి ఆకాశంలో మేఘాలు దట్టంగా క్రమ్ముకొస్తున్నాయి. వాళ్లని పంపించి మీరు వేగం లోనికి రండి... ఈ పెద్ద పొట్లాం రాముడికి సుమండీ" అని ఒక్క గుక్కలో చెప్పేసి ఇంట్లోకి దారితీసింది.

"రాముడూ... రా... ఇంద... నీకోసం ప్రత్యేకంగా పెద్ద పొట్లాఁవుడు ప్రసాదం మీ బుగతమ్మ ఇచ్చింది"అంటూ శాస్త్రి రాముణ్ణిపిల్చేరు.

రాముడు తండ్రి వెనక్కిపోయి దాఁగున్నాడు. జంకుతూ, వెనక్కి తగ్గుతున్న రాముణ్ణి నెమ్మదిగా లాక్కొచ్చేడు వెంకడు. శాస్త్రి కూర్చొని ఉన్న అరుగుకి రెండు గజాల దూరంలో వాళ్లు ఆగిపోయేరు.

అరుగుదగ్గరే నేలని కూర్చొని ఉన్న బసవయ్య కూడా లేచి నిలబడ్డాడు.

శాస్త్రి అరుగుదిగి వాళ్ల దోసిళ్లలో ఎత్తి ప్రసాదపు పొట్లాలు పడేస్తూవుంటే, చిన్న చినుకులు పడటం ప్రారంభం అయింది.

* * *

ముసురు.

మూడవరోజుకల్లా ముసురు ముదిరింది.

చిటపట పడుతున్న చినుకులు క్రమంగా బలం పుంజుకున్నాయి.

మూడవనాటి సాయంత్రానికి ధారాపాతంగా మారింది వర్షం. కుంభవృష్టికి తోడుపడ్డాయి ఝంఝూమారుతాలు.

చెట్లు కూలిపోతున్నాయి.

పూరిళ్లపై ఉన్న తాటాకులు, రెల్లుగడి ఎగిరి పోతున్నాయి, పక్షుల్లాగ.

చెట్లపై గూళ్లల్లో ఉంటున్న పిట్టలు ఆ పెనుగాలికి అల్లల్లాడిపోతున్నాయి; రెక్కలు విరిగి నేల కూలుతున్నాయి; నీట మునుగుతున్నాయి; ప్రాణాలు కాపాడుకోటానికి గిజగిజ కొట్టు కుంటున్నాయి.

పాలతేరు గ్రామం అంతా జలమయం అయిపోయింది. ఊరు నీటిమీద తేలుతున్నదా అనిపిస్తున్నది.

కటిక చీకటి.

కన్ను పొడుచుకున్నా కనపడని చీకటి.

నల్లటి నీటి కుండల్లాగ, ఆకాశం నిండా అలముకొనిపోయి ఉన్న కారునలుపు మేఘాలు, భారంగ కదులుతున్నట్లు కనిపిస్తున్నాయి, మెరుపు మెరిసినపుడు.

ఫెళఫెళమని ఉరుములు.

బ్రహ్మాండం బ్రద్దలైనట్లు పిడుగులు

ఆర్తనాదాలు— మానవులూ, జంతువులూ, పక్షులూ, కీటకాలు ప్రాణ భయంతో చేస్తున్న ఆర్తనాదాలు.

అర్ధరాత్రికి గాలి వేగం తగ్గింది

వర్షవేగం తీవ్రం అయింది.

అంతలో ఏదో ఒక కొత్త హోరు వినబడింది

అందరి గుండెల్లోనూ హోరు లేచింది.

ఏమంటే ఏరు పొంగుతూన్నప్పుడు పుట్టే హోరది. వేగవతీనది అసలే దొంగ ఏరని పేరు పడింది. ఉన్న పళంగా ఉవ్వెత్తున పొంగి పొర్లటం వేగవతికి ఆ బిరుదు తెచ్చింది.

హరికెన్ లాంతర్లు పట్టుకొని, అవి ఆరిపోకుండా జాగ్రత్తపడుతూ, ఊరిలోని పెద్దమనుషులు, ధైర్యశాలులూ, పల్లపుప్రదేశాల్లో ఉన్నవాళ్లని, కనీసం ప్రాణాలు కాపాడుకోటానికేనా, ఎత్తుప్రదేశాలకి తరలిపోవాలని, ఆలస్యం చేయటం మంచిది కాదనీ హెచ్చరించటం ప్రారంభించేరు.

మునసబు నరసన్నాయుడు, మోతుబర్లు అప్పలనాయుడు, లక్షున్నాయుడు, బుగతలు పెద్దబ్బి, వెంకటశాస్త్రి, రామలింగస్వామి, కోమటి పెద్దవెంకట్రాయలు, వెలమ ప్రభువులు నరసింహ రాయణింగారు, గోపాలరాయణింగారు, వెంకట్రావు గారు, ప్రజలకి ఆ చీకటిలో సహాయం అందించ నడుం కట్టేరు.

దివిటీలు వెలిగించి పెంకుటిళ్ల వరండాల్లో నిలబెట్టేరు.

వీధులలో నీరు మోకాలుబంటి అయింది.

ఏటి హోరు క్రమక్రమంగా హెచ్చుకాజొచ్చింది. ప్రవాహ వేగం కూడా ఉద్ధృతం అయింది.

సెలవలకని వచ్చిన యువకులు, ముఖ్యంగా తరలింపు కార్యక్రమంలో అందరికీ సహాయం కాజొచ్చేరు. వాళ్లని చూచి యువకులందరూ ముందుకురికేరు.

వీధులలో నీరు మొలబంటి అయింది.

రాత్రి నాలుగు గంటలయింది.

ఇళ్ల వెన్నుకుప్పలమీద చేరిన. కోళ్లు 'కొక్కొరోకో' అని కూసేయి.

ఆ కూతల్లోకూడా విషాదపు జీర వినిపించింది.

అందరి మనస్సుల్లోనూ ఒకటే ఆశ. మరో గంట పోతే తెల్లవారుతుంది. ఎందరి బ్రతుకులు తెల్లారిపోతాయో! చీకటి పోతుంది. వెలుగు కావాలి... వెలుగు రావాలి. ఎలాంటి విపత్తునేనా వెలుగులో ఎదుర్కోవచ్చును. "సూర్యభగవానుడా వేగం ఉదయించు, మా బ్రతుకుల్లో వెలుగు నింపు" అని అందరూ మనస్సుల్లోనే ప్రార్థించుకున్నారు!

పెద్ద మెరుపు మెరిసింది.

ఆ బ్రహ్మాండమైన కాంతికి తట్టుకోలేక అందరి కళ్ళూ మూతలు పడిపోయేయి.

చెవులు చిల్లులు పడేటట్లు, గుండెలు గుభిల్లు మనేటట్లు ఒక పెద్ద పిడుగు పడింది.

భూమి దద్దరిల్లినట్లయింది.

కొంచెం దూరంలోనే ఉన్న కొబ్బరిచెట్టుమీద ఆ పడుగు పడిందో ఏమో? కొబ్బరి కొమ్మలు మండటం చూస్తూ ప్రజలాగిపోయేరు. కొన్ని క్షణాలపాటు ఆ కొబ్బరిచెట్టు తల విరబోసుకున్న కొరివి దెయ్యంలాగా కనిపించింది.

ఆ దృశ్యం అందరి మస్తిష్కాల్లోను మంటలు రేపింది.

అంధకారం తగ్గటం ప్రారంభించింది.

అందరిలోనూ ఆశా కిరణాలు ప్రభవించేయి.

వరద వడి మాత్రం ఎక్కువవుతూనే ఉంది.

భయాందోళనలు ప్రజల్లో ప్రబలం కాజొచ్చినవి!

తెల్లవారింది.

తమ బ్రతుకులెలా తెల్లవారేయో అని ఎందరో బెంగ పెట్టుకుంటూనే ధైర్యం తెచ్చుకుంటూ పిల్లలని పెళ్ళాలకి అప్పగించి తమ తమ నివాస గృహాల పరిస్థితి చూడాలనే ఆతృతతో ఆ మొల బంటి నీటిలో బయలుదేరేరు ...

రకరకాల పురమాయింపులు, ఆందోళనలు, అభ్యర్థనలు, శాపనార్థాలు, వేదాంత ధోరణులు, ఏడుపులు, మొర్రలు ... ఎవరిగోల వారిదే.

ఆపత్కాలంలో స్వార్థం విజృంభిస్తుంది.

మాలపల్లి ఊరుకి దూరంగా ఉంది. ఏటికి దగ్గరగా ఉన్నా చాలా ఎత్తైన ప్రదేశంలో ఉండబట్టి వరదబాధ వాళ్ళకి లేకపోయింది. కాని పూరికొంపలే అన్నీని. పెనుగాలిలో పూర్తిగా పైకప్పు లెగిరిపోయేయి. మిద్దె యిళ్ళుకూడా కూలిపోయేయి.

వెంకన్న రాముణ్ణి భుజంమీద కూర్చోబెట్టుకుని, దూరాన వారగా నిలబడి ఉన్నాడు. మాలపల్లిలో వాడి చెల్లీ పిల్లలు ఎలా ఉన్నారో చూడాలని అలమటించిపోతున్నాడు.

వెంకటశాస్త్రి, నరసన్నాయుడు, పెద్దబ్బి గారు, రాయణంగార్లు, అందరి యోగక్షేమాలు కనుక్కుంటూ, ఊరందరూ సురక్షిత ప్రాంతాలకి చేరుకున్నారో లేదో అని కనుక్కుంటున్నారు.

వర్షం ధారాపాతంగా పడుతూనే ఉంది.

ఆకాశం నిండా కారు మేఘాలే!

వేగవతీ నది హోరుమంటూ ఊరుమీదే విరుచుకుపడి పారుతున్నది. ఉవ్వెత్తుగా కెరటాలు లేస్తున్నాయి. ఆ ప్రవాహ వేగంలో ఎంత శక్తి నిబిడీకృతమై ఉన్నదోకాని, మహా వృక్షాలు కూడా సమూలంగా కూలిపోయి కొట్టుకుపోతున్నాయి.

అలా కొట్టుకుపోతున్న ఒక చెట్టు కొమ్మమీద ఓ వృద్ధుడు కూర్చొని ఉన్నాడు. అతని ప్రక్కనే అడుగు దూరంలో ఒక పెద్ద త్రాచుపాము కొమ్మకి చుట్టుకొని ఉన్నది.

మరొక ప్రక్క, ప్రవాహపు సుడి గుండంలో గిరగిర తిరుగుతూ కొట్టుకుపోతున్న ఒక పూరింటి చెన్నుకప్పుమీద చంటిబిడ్డని గుండెలకి హత్తుకొని కూర్చొని ఉన్నదొక లేబ్రాయపు టిల్లాలు.

అటువంటి దృశ్యాలు చూస్తున్న పాలతేరు ప్రజ, తమ పరిస్థితే కొంత నయం అనుకున్నారు. ఇళ్ళు వాకళ్ళు ఏమవుతున్నా తాము మాత్రం సురక్షితంగానే ఇప్పటిదాకా ఉన్నారు. కాని ఆ ప్రదేశం కూడా వరదనీటితో పరివేష్టితం అయిపోతున్నది. నీటిమట్టం క్షణ క్షణం పెరుగుతున్నది.

పాదాలు తడుస్తున్న నీళ్లల్లో నిలబడి ఉన్నారు రాముణ్ణి బుజాన వేసుకొని వెంకన్న, మరో నలుగు రైదుగురు హరిజనులు, తక్కిన ప్రజకి పది గజాల దూరంలో. వారి యోగక్షేమాలు కనుక్కొనటానికి వస్తున్న వెంకటశాస్త్రిని చూడగానే వెంకన్న రాముణ్ణి క్రిందికి దించి నిలబెట్టి రెండు చేతులూ జోడించి నిలబడ్డాడు.

శాస్త్రి కళ్ళు ఆర్ద్రం అయేయి.

''అలా నీళ్లల్లో తడుస్తూ నిలబడ్డారేమిటి. పదండి ఆ పంచన చేరండి... మేమేం మైలపడి పోము. గంగకీ, మృత్యువుకీ బ్రాహ్మణ హరిజన విచక్షణకాని కులమత ప్రసక్తికాని లేవు... పదండి!''

కరుణామయము, మానవతా తత్వపూర్ణమూ అయిన శాస్త్రి మాటలలో ఆ పేదమానవులు తమ బ్రతుకుల్లోఎన్నడూఎరగనిఆప్యాయతనిరుచిమూసేరు.

ఆ క్షణంలో ఆ పరిసరాల నిండా అపూర్వము అవేద్యమూ ఐన ఒక పవిత్ర వాతావరణం పొడమింది.

కాని భగవంతుడికి మాత్రం ఇదేమీ తెలియ దేమో అనిపిస్తుంది. భీషణ ప్రకృతి వికటాట్టహాసం చేసినట్లయింది.

భయంకరమైన హోరుతో, వాళ్ల వెనక ప్రక్కనుంచి వరద వచ్చిపడింది.

అది కనురెప్పపాటు కాలం.

రాముడు వరదలో కొట్టుకుపోతున్నాడు తక్కినవాళ్ళు ఆ ఆఘాతం నుంచి తేరుకొనేలోపునే రాముడు పదిగజాల దూరం కొట్టుకుపోయేడు

అందరూ నిర్ఘాంతపోయేరు.

హాహాకారాలు మిన్నుముట్టేయి

''రావుడూ'' అని అరుస్తూ ముందుకి ఉరకుతున్న వెంకడిని, నలుగురు పట్టుకొని ఆపేసేరు

''నా కొడుకో'' అన్న వెంకన్న ఆక్రందనంలో పరమ పాషాణాలని కూడా కరిగింపజాలిన ఆవేదన నిండిపోయి ఉన్నది. అందరి గుండెలూ తరుక్కుపోతున్నవి.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా శాస్త్రి గామంచా బిగించి, పైమీద తుండుగుడ్డ విసిరేసి, నీటిలోకి ఉరికి, బారలు వేసుకుంటూ, మునుగుతూ తేలుతూ కొట్టుకుపోతున్న రాముడి దగ్గరికి వెళుతూ ఉంటే అందరూ నివ్వెర పోయేరు.

ఉరకలు వేసుకుంటూ పరుగెడుతున్న వేగవతీ నది వరద వేగానికీ, బారలు వేసుకుంటూ ఆ వరద లోనే తీవ్ర వేగాన్ని పుంజుకుంటున్న శాస్త్రి ఈత జవానికీ, పందెం జరుగుతున్నట్లు అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

లక్ష్మీదేవమ్మ పుస్తెలు రెండు కళ్లకీఅద్దుకొని, కళ్ళుమూసుకొని చేతులెత్తి మొండం పెట్టింది.

మూతపడి ఉన్న ఆమె కళ్ల రెప్పల క్రింద నుండి అశ్రుకణాలు రాలసాగేయి.

వెంకన్న వాళ్లల్లా కళ్ళు చేసుకొని చూస్తున్నాడు, ఏడుస్తున్నాడు.

అందరి గుండెలూ ఒక్కమాటు ఆగిపోయేయి

శాస్త్రి మునిగిపోయేడు, తేలేడు, మునిగేడు!

హాహాకారాలు, గోల.

సుదీర్ఘమైన అరవై సెకన్లు గడిచేయి అల్లంత దూరాన రావుణ్ణి ఒక చేతో పట్టుకుని రెండవ చేతో నీటిని వెనక్కితోస్తూ ఒడ్డుకి చేరుతున్న శాస్త్రిని చూచి పరుగెత్తేడు వెంకన్న... వాడి వెంటనే లక్ష్మీదేవమ్మ... ఆ వెంట అందరూను!

వాళ్లందరి గమనవేగానికి ఈడు కాలేకపోయింది వేగవతీ నది వరద! ★